క్లుప్తంగా

ఎమ్మెల్సీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్ లో చేరిన రాజేశ్ దంపతులు

రాయికల్: బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి తలారి రాజేశ్, మైతాపూర్ మాజీ ఎంపీటీసీ తలారి నాగమణి బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి, ఆదివారం 50 మంది అనుచరులతో నిజామాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి జీవన్‌రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంటి చూపును కాపాడుకోవాలి



శస్త్ర చికిత్స అనంతరం పేషెంట్లతో ఎమ్మెల్యే

జగిత్యాలటౌన్: ప్రతి ఒక్కరూ కంటి చూపును జాగ్రత్తగా కాపాడుకోవాలని ప్రముఖ నేత్రవైద్యుడు, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సూచించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పావని కంటి ఆస్పత్రిలో ఆపి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నియోజకవర్గానికి చెందిన 20మంది నిరుపేదలకు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఉచిత కంటి శస్త్ర చికిత్సలు చేసి, మందులు, కంటి అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో పావని ఆస్పత్రి వైద్యులు డాక్టర్ విజయ్‌కుమార్., ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న అధికారులు

కథలాపూర్: కోరుట్ల- వేములవాడ రూట్‌లో కథలాపూర్ మండలం పోసానిపేట శివారులో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం అధికారులు ఆదివారం ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి వదిలిపెట్టారు. పార్లమెంట్ ఎన్నికల వేళ ఎక్కువ డబ్బులు, మద్యం తరలిస్తే కఠినచర్యలుంటాయని అధికారులు పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు శ్రీనివాస్, రాజు ఉన్నారు.

హనుమాన్ దీక్షాపరులకు పండ్లు పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న సోగ్రబి

కోరుట్ల: పట్టణంలోని అతి పురాతన మహాదేవ స్వామి ఆలయంలో హనుమాన్ దీక్షా పరులకు 17వ వార్డు మాజీ కౌన్సిలర్,జిల్లా మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు సోగ్రబి ఆధ్వర్యంలో ఆదివారం పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు, మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అక్బర్, ఆలయ ఛైర్మన్ నరేష్, దీక్షాపరులు పాల్గొన్నారు.

రాధాకృష్ణుల కల్యాణం..

మండలంలోని అయిలాపూర్‌లో శ్రీ సత్యానంద మహర్షి ఆశ్రమంలో ఆదివారం రాధాకృష్ణుల కల్యాణం ఘనంగా జరిగింది. కళ్యాణోత్సవంలో కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కుంతం రాజం, తిరుమల గంగాధర్ గౌడ్, ఎంపీటీసీ చింతకుంట వనిత, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

దీక్షాపరులకు మజ్జిగ పంపిణీ

సారంగాపూర్: కొండగట్టు అంజనేయస్వామి ఆలయంలో దీక్షా విరమణ చేయడానికి దూర ప్రాంతాల నుండి సారంగాపూర్ మీదుగా కొండగట్టు వెలుతున్న దీక్షాపరులకు సారంగాపూర్‌లో అంజనేయస్వామి దీక్షాపరులు మజ్జిగ, చల్లటి మంచినీరు, అందించారు. ఆలయంలో సేద దీరే విధంగా ఏర్పాటు చేసి సేవలందిస్తున్నారు.

నేటి నుంచి ప్రతిష్ఠ మహోత్సవాలు

రాయికల్: పట్టణంలోని గుడికోటలో ఈనెల 22 నుంచి 24 వరకు లకుమాదేవి, దత్తాత్రేయ, జగద్గురు శంకరాచార్యుల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహింస్తున్నట్లు ఆలయకమిటీ ఛైర్మన్ తుమ్మల సదాశివరెడ్డి,అర్చకులు రమేశ్,సతీశ్ శర్మలు ఆదివారం తెలిపారు.



ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న భక్తులు



ధ్వజారోహణంలో భక్తులు



మసాయిపేటలో బోనాలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

ధ్వజస్తంభం పునః ప్రతిష్ఠాపన

కథలాపూర్: మండలకేంద్రంలో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధ్వజ స్తంభం పునః ప్రతిష్ఠాపన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ధ్వజస్తంభాన్ని ఊరేగింపుగా దేవాలయానికి తీసుకువచ్చి ప్రత్యేక పూజలు చేసి అనంతరం ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయకమిటీ సభ్యులు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజారోహణం

కోరుట్ల: పట్టణంలోని బస్టాండ్ రోడ్‌లోని ఆంజనేయ స్వామి ఆలయంలో ఆంజనేయ జయంతోత్సవాల్లో భాగంగా ఆదివారం ధ్వజారోహణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, యజ్ఞం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో విక్రమ్, పెడిపెల్లి నర్సయ్య, గుంటుక జ్ఞానేశ్వర్, రాజయ్య, హరీశ్, మనోజ్, రాములు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్నస్వామి జాతర

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం మాసాయిపేటలో మల్లన్న స్వామి జాతర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు,అర్చనలు,అభిషేకాలు నిర్వహించారు.భక్తులు సాయంత్రం బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: కోరుట్ల మున్సిపల్ పరిధిలోని యెఖీన్‌పూర్ గ్రామ శివారులోని మల్ల న్న స్వామి ఆలయంలో జాతర ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించరూ..?

- మండలంలో 28 ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- 13 కేంద్రాల్లో ఇంకా ప్రారంభించని వైనం
- 20 రోజుల నుంచే కేంద్రాల్లో వడ్లు బోస్తున్న రైతులు
- కొనుగోలు ప్రారంభించాలని రైతుల వేడుకోలు



సంగెం కొనుగోలు కేంద్రంలో ధాన్యం ఆరబోస్తున్న రైతులు

కోరుట్ల రూరల్: రాష్ట్ర ప్రభుత్వం 20 రోజుల క్రితమే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికీ హమాలీల కొరతతో పలు కేంద్రాల్లో కొనుగోళ్లు ప్రారంభించ లేదు. కొనుగోలు సెంటర్లలో 20 రోజుల క్రితమే ధాన్యం పోసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. త్వరగా కొనుగోళ్లు ప్రారంభించాలని వేడుకుంటున్నారు.

మండలంలో 28 కొనుగోలు కేంద్రాలు..

మండలంలోని 15 గ్రామాల్లో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 28 ధాన్యం కొనుగోలు కేంద్రాలను 20 రోజుల క్రితమే ప్రారంభించారు. కానీ ఇంతవరకూ 11 కొనుగోలు కేంద్రాల్లో హమాలీల కొరతతో తూకం ప్రారంభిచలేదు. ఐకేపీ ఆధ్వర్యంలో 12 కొనుగోలు కేంద్రాలు,పీఏసీఎస్ ఆధ్వర్యంలో 17 కేంద్రాలను ప్రారంభించారు. కాగా 7 ఐకేపీ కేంద్రాలు, 6 పీఏసీఎస్ కేంద్రాల్లో ఇంత వరకూ ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించలేదు. రైతులు పోసిన ధాన్యాన్ని ప్రతీ రోజు సెంటర్లకు వెళ్లి ఆరబెట్టి వస్తున్నారు. వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పుల కారణంగా వర్షం పడితే ఎండిన వడ్లు మళ్లీ తడిచి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. రెండురోజులుగా వాతావరణం మబ్బులు పడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కొనుగోళ్లు ప్రారంభం కాని కేంద్రాలు..

మండలంలోని పైడిమడుగు, జోగిన్‌పెల్లి, వెంకటాపూర్, మోహన్‌రావుపేట, చిన్నమెట్‌పల్లి, సంగెం , నాగులపేట గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించలేదు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంగెం, నాగులపేట, పెద్దాపూర్, రాంరావుపల్లె,గుమ్లాపూర్, మోహన్‌రావుపేట గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కాకపోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధాన్యం తూకం ప్రారంభించి కొనుగోళ్లు వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.

తొందరగా కొనుగోళ్లు చేపట్టాలి



వాతావరణం సరిగా ఉండటం లేదు. చెడగొట్టు వానలు పడుతాయోమోనని భయం ఉంది. వడ్లు రోజూ ఆరబెడుతున్నం. వాన పడుతుందేమోనని మళ్లీ కుప్ప పోసి టార్పాలిన్ కప్పుతున్నం. తొందరగా ధాన్యం కొనుగోలు చేస్తే బాగుంటుంది. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– రాంరెడ్డి రైతు, సంగెం

త్వరలో ప్రారంభిస్తాం



హమాలీల కొరతతో కొనుగోళ్లు ప్రారంభించటం ఆలస్యమవుతోంది. హమాలీలు వస్తున్నారు. రాగానే రేపటి వరకూ అన్ని కేంద్రాల్లో కొనుగోళ్లు ప్రారంభిస్తాం. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి, మ్యాచర్ కు సిద్ధం చేయాలి. త్వరత్వరగా కొనుగోళ్లు పూర్తి చేస్తాం. రైతులు ఆందోళన చెందవద్దు.

– బాబా, సీఈవో, పీఏసీఎస్, యెఖీన్‌పూర్

వీర హనుమాన్ విజయయాత్ర ర్యాలీ



మల్లాపూర్‌లో వీర హనుమాన్ విజయయాత్ర ర్యాలీలో హనుమాన్ భక్తులు

మల్లాపూర్: మండల కేంద్రంలో విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ), బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఆదివారం వీర హనుమాన్ విజయయాత్ర ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథులుగా కిసాన్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి, జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ ఆకుతోట రాజేశ్, మరిపెల్లి సత్తెమ్మలు హాజరై స్థానిక హనుమాన్ ఆలయం వద్ద భారీ ర్యాలీని ప్రారంభించారు. హనుమంతుడి శక్తిని సమాజానికి తెలియజేయడానికి యువత ముందుండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షుడు కైర నాగేష్, మండల ఉపాధ్యక్షుడు చిలివేరి నవీన్, పట్టణ అధ్యక్షుడు వెంపేట లక్ష్మారెడ్డి, భజరంగ్‌దళ్ మండల కన్వీనర్ బండి జైపాల్, పట్టణ కో-కన్వీనర్ గాండ్ల మణికంఠ, నాయకులు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ వ్రతాలు



సత్యనారాయణ స్వామివ్రతంలో దంపతులు

జగిత్యాలటౌన్: సేవా భారతి ఆధ్వర్యంలోని వాల్మీకి ఆవాస నూతన భవనంలో ఆదివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం ఘనంగా నిర్వహించారు. గ్రామీణ నిరుపేద విద్యార్థులకు ఉచిత భోజన వసతి కల్పిస్తూ సంస్కారంతో కూడిన విద్యను అందిస్తున్న వాల్మీకి ఆవాసంలో ప్రతి ఏటా విద్యాసంవత్సరం ముగింపు సందర్భంగా విద్యార్థుల బంధువులు, పుర ప్రముఖులతో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించడం ఆనవాయితీ వస్తోంది. అర్చకులు కంజర్ల వేణుమాధవాచారి, రామకృష్ణల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వ్రతంలో సుమారు 200మంది దంపతులు పాల్గొన్నారు. వ్రతం అనంతరం ప్రసాద వితరణ, అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆవాసం అధ్యక్షుడు జిడిగె పురుషోత్తం, కార్యదర్శి నందెల్లి మదన్‌మోహన్‌రావు, సభ్యులు డా, శంకర్, అశోక్‌రావు, చిత్తారి మధుకర్, సంపూర్ణచారి, ఆవాసం ప్రముఖ్ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లుల్లో ఎమ్మెల్యే తనిఖీ



ధాన్యం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కొండగట్టు: కొడిమ్యాల మండలం నమిలికొండ శివారులోని రైస్ మిల్లులను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం ఆదివారం సందర్శించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యంను శ్రీమన్నారాయణ రైస్ మిల్లు యాజమానులు తీసుకోవడం లేదని కొందరు రైతులు ఫిర్యాదు చేయడంతో తనిఖీ చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తప్ప,తాలు పేరుతో రైతులను ఇబ్బంది పెట్టే రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు ధాన్యం అమ్మకాల్లో ఇబ్బంది కలగకూడదని కలెక్టర్లు, సంబంధిత అధికారులతో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని, మిల్లర్లు ఎవరైనా ఇబ్బంది పెడితే తనకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కొంతమంది మిలర్లు రైతులు ఇబ్బంది పెడుతున్నారని తమ దృష్టికి వచ్చిందని మరోసారి ఇలాంటి చర్యలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో కొడిమ్యాల సొసైటీ చైర్మన్ రాజనరసింగరావు, నాయకులు కమలాకర్‌రెడ్డి, ముత్యం శంకర్, గోల్కొండ రాజు, ముత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో ఇంటింటా కాంగ్రెస్ నాయకుల ప్రచారం



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జగిత్యాలటౌన్: నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డికి ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తుందని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు, మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ తాటిపర్తి విజయలక్ష్మి అన్నారు. పట్టణంలోని 45వ వార్డులో ఆదివారం కాంగ్రెస్ నాయకులతో కలిసి జీవన్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారం చేపట్టిన వంద రోజుల్లోనే ఇచ్చిన హామీలను అమలు చేసి చూపించిందన్నారు. అభివృద్ధికి మారుపేరుగా నిలిచిన జీవన్‌రెడ్డిని నిజామాబాద్ కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిపించి పార్లమెంట్‌కు పంపాలని కోరారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎలిగేటి నర్సయ్య, పిప్పరి అనిత, లవంగ రాజేందర్, రియాజ్, గంగాధర్, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

మల్లాపూర్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డ్ అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేని బీఆర్ఎస్, బీజేపీ నాయకులు రైతుల పేరిట దొంగ దీక్షలతో డ్రామాలాడారని దుయ్యబట్టారు. రైతులు అండగా నిలబడి కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డిని భారీ మేజార్టీతో గెలుపించాలన్నారు. లోగోను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నల్ల బాపురెడ్డి, కాంగ్రెస్ సేవాదళ్ మండల అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సారంగాపూర్ ఇన్‌చార్జి ఎస్సైగా గౌతం పవార్

సారంగాపూర్: మండల ఎస్సైగా బీర్‌పూర్ ఎస్సై గౌతంపవార్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. గంజాయి మాయం కేసులో సారంగాపూర్ ఎస్సై తిరుపతి సస్పెండ్ కావడంతో ఆయన స్థానంలో బీర్‌పూర్ ఎస్సైకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ పోలీస్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

బీర్‌పూర్‌లో గుడిసె దగ్ధం

సారంగాపూర్: బీర్‌పూర్ మండల కేంద్రంలో ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో గుడిసె దగ్ధమై రూ. లక్ష , బంగారం కాలిబూడిదైంది. గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన బద్ది లింగన్న, ఆయన కుటుంబ సభ్యులు రాత్రి పొలాన్ని కోయించడానికి వెళ్లారు. వారు ఇంట్లో లేని సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయి గుడిసెకు మంటలు అంటుకున్నాయి. గ్రామస్తులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా అదుపులోకి రాకపోవడంతో అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. కాగా లింగన్న ఇటీవల మిర్చి పంట అమ్మగా వచ్చిన రూ. 1లక్ష డబ్బులు, రెండు తులాల బంగారం, ఇతర సామగ్రి మొత్తం కాలిబూడిదైనట్లు బాధితుడు లింగన్న తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరారు.

కొండగట్టు ఘాట్‌రోడ్డులో ప్రమాదం

కొండగట్టు: జగిత్యాల జిల్లా కొండగట్టు ఘాట్ రోడ్డులో ఆదివారం ట్రాక్టర్ ప్రమాదాదానికి గురైంది. హనుమాన్ చిన్న జయంతి సందర్భంగా మల్యాల గ్రామ పంచాయతీకి చెందిన ట్రాక్టర్ ట్యాంకర్ ద్వారా నీటిని గుట్టమీదకు తీసుకువెళ్లి చలివేంద్రాల్లో నీటిని నింపారు. అనంతరం తిరిగి ఘాట్ రోడ్డు మీదుగా, కిందికి దిగుతుండగా ఘాట్ రోడ్డు మొదటి మలుపు వద్ద బ్రేక్ ఫెయిల్ అవడంతో గోడను ఢీకొంది. ఈ ప్రమాదంతో ట్రాఫిక్ జాం అవడంతో అధికారులు జేసీబీ సాయంతో ట్యాంకర్‌ను తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

బీసీ సంఘం ప్రధానకార్యదర్శిగా ఇమ్మడి విజయ్

రాయికల్: పట్టణ బీసీ సంఘం ప్రధానకార్యదర్శిగా రాయికల్‌కు చెందిన ఇమ్మడి విజయ్‌ను నియమించినట్లు పట్టణ అధ్యక్షుడు సామల సతీశ్ ఆదివారం తెలిపారు. సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని విజయ్ పేర్కొన్నారు.

డబుల్ రోడ్డు పూర్తయ్యేదెప్పుడో..?



అసంపూర్తిగా భూషణరావుపేట- కోనాపూర్ డబుల్ రోడ్డు పనులు

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట, నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పెల్లి మండలం కోనాపూర్ గ్రామాల మధ్య డబుల్ రోడ్డు పనులు రోడ్లు, భవనాల శాఖ అధికారులు ఆరు నెలల క్రితం ప్రారంభించారు. అప్పట్లో అసెంబ్లీ ఎన్నికలుండటంతో పనులు హడావుడిగా చేశారు. ఎన్నికలు పూర్తయ్యాక రోడ్డు పనులు ఆగిపోయాయి. ఆ తర్వాత పట్టించుకునేవారు కరువయ్యారని ప్రజలు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆగిన రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయించాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

హన్మాన్ భక్తులకు రేడియం స్టిక్కర్లు



స్టిక్కర్లు అంటిస్తున్న పోలీసులు

ధర్మపురి: కొండగట్టు అంజన్న దర్శనానికి రాత్రి వేళల్లో కాలినడకన వెళ్తున్న హన్మాన్ భక్తులకు రోడ్డు భద్రతల దృష్ట్యా రేడియం స్టిక్కర్లను అతికించారు. మండలంలోని రాయపట్నం కూడలి వద్ద ఆదివారం రాత్రి సీఐ రామనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు భక్తులకు స్టిక్కర్లను అతికించారు. రాత్రి వేళల్లో వచ్చే వాహనదారులు భక్తులను రేడియం స్టిక్కర్ల ద్వారా గుర్తించవచ్చని తెలిపారు.

కానిస్టేబుల్ సస్పెండ్

జగిత్యాలక్రైం: వెల్గటూర్ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న వేణు అనే కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. భార్యభర్తల మధ్య విభేదాలు రావడంతో భార్య ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు సస్పెండ్ చేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



రాయికల్: మండలంలోని ఇటిక్యాల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1998–99 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులంతా కలిసి ఆదివారం పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 26 ఏళ్ల క్రితం పాఠశాలలో చేసిన అల్లర్లు గుర్తుచేసుకున్నారు. విద్యాబోధన నేర్పిన గురువులను సన్మానించారు.కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.